కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 30, పచ్చిమిర్చి 50 , బెండ 50, కాకర 50, దొండ 50, దోస 40, ఆలు 30, చామ 50, కీర 40, బీర 50, వంకాయ 60, గోకర 80, బీన్స్ 90, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 60, చిక్కుడు 80, ఉల్లి 30(కేజీ), ములక్కాయలు (1) 10 , క్యాలీఫ్లవర్ (1) 50, సొరకాయ (కేజీ) 40, అల్లం 100, వెల్లుల్లి 150.

పూడిక తరలించరా..?



పీజేఏఆర్ ఎన్‌క్లేవ్ రోడ్డులో వ్యర్థాల కుప్ప

మియాపూర్ : అండర్‌గ్రౌండ్ డ్రైనేజీని శుభ్రం చేసి చెత్తచెదారాన్ని రోడ్డుపైనే వదిలేయడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మదీనగూడ పీజేఏఆర్ ఎన్‌క్లేవ్ వెళ్లే జాతీయ రహదారి పక్కన సుమారు 10 రోజుల కిందట చెత్తచెదారాన్ని తొలగించి వదిలేశారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసన వెలువడుతుందని, వర్షాలు పడితే చెత్తచెదారం డ్రైనేజీ పైప్‌లైన్ లోకి వెళ్లే అవకాశముందని వాపోతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

అలరించిన స్వరార్చన



మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్యస్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీమయి స్వరార్చన కార్యక్రమంతో సందర్శకులను అలరించారు. చల్లామారుతి కిరణ్ విద్యార్థిని శ్రీమయి మహా గణపతిం, శక్తి సహిత, శ్రీమన్నారాయణ, ముద్దుగారే యశోద, కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు వాడు, చక్కని తల్లికి, జగదపు, ఎక్కడి మానుష, శరణు శరణు, గరుడ గమన, అయిగిరి నందిని, గోవిందనామాలు కీర్తనలను అలపించారు. వయోలిన్ ధనుంజయ, మృదంగం మల్లికార్జున సంగీత సహకారాన్ని అందించారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నందకుమార్ కళాకారులను జ్ఞాపికలతో సత్కరించారు.

నియామకం

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్‌కు చెందిన రవీంద్రనాథ్ ఠాగూర్‌ను సేవా భారతి పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు మోతీనగర్ ట్రస్టీగా శనివారం నియమించారు. అనంతరం ట్రస్ట్ పాలక కార్యవర్గం ఆయనను ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో చైర్మన్ బి. సీతారామయ్య, వైస్ చైర్మన్‌రెడ్డి, కోశాధికారి నాగేశ్వరరావు, ట్రస్టీలు సీఎస్ఆర్ మూర్తి, పీఏఎస్ మూర్తి, జి. ఉమా మహేశ్వర రావు, సుబ్బరామయ్య, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి కృషి

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ కాలనీ 5వ ఫేజ్‌లో కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు శనివారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు పర్యటించారు. ఎస్ఎస్ఎల్ మాల్ దగ్గర మూసివేసిన రోడ్డును తెరిచి ప్రస్తుతం ఉన్న యోగా సెంటర్ వద్ద యుటర్న్ తీసి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వద్ద యూ టర్న్ ఇవ్వాలని కాలనీవాసులు కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎంజీఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ సహాయ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బుర్ల రామకృష్ణకు ఉస్మానియా యూనివర్శిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. బయోగ్యాస్, కాటన్ సీడ్ ఆయిల్, డైథైల్ ఈథర్ మిశ్రమంతో ఎల్‌హెచ్ఆర్ సీఆర్‌డీఐ ఇంజన్‌పై ఉద్గార లక్షణాల ప్రయోగాత్మక పరిశోధనకు ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఉస్మానియా యూనివర్శిటీ మెకానికల్ ఇంజనీరింగ్ సీనియర్ ప్రొఫెసర్ పి.ఉషాశ్రీ పర్యవేక్షణలో పరిశోధన చేసి థీసిస్‌ను సమర్పించారు. రామకృష్ణకు డాక్టరేట్ రావటంపై కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఆయనను శనివారం అభినందించారు.

స్థానిక ఎన్నికల్లో పోటీ

శంషాబాద్: స్థానిక సంస్థలకు త్వరలో జరగనున్న ఎన్నికల్లో లౌకిక ప్రజాస్వామ్య శక్తులతో కలిసి పోటీ చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. శనివారం పట్టణంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మతతత్వ శక్తులను ఓడించడమే ప్రధాన అజెండాగా తమ కార్యాచరణ ఉంటుందన్నారు.

51వసంతాలు..25వ స్నాతకోత్సవం

7వ తేదీ నిర్వహించేందుకు ఏర్పాట్లు
- 1717 మంది విద్యార్థులకు డిగ్రీల ప్రదానం
- 182 మెడల్స్.. 242 మందికి పీహెచ్‌డీలు



హెచ్‌సీయూ ప్రధాన ద్వారం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) 25వ స్నాతకోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. అక్టోబర్ 7వ తేదీన గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో ఉదయం 10.45 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుంది. 1974లో ఏర్పాటైన హెచ్‌సీయూ 51 ఏళ్ల రాగా 25వ స్నాతకోత్సవాన్ని జరుపుకోనుంది. స్నాతకోత్సవంలో డిగ్రీలు,మెడల్స్, పీహెచ్‌డీల ప్రదానం చేయనున్నారు.

- 1,717 మంది విద్యార్థులకు డిగ్రీల ప్రదానం
- 182 మంది ప్రతిభ చాటిన విద్యార్థులకు మెడల్స్
- 242 మందికి పీహెచ్‌డీ డిగ్రీలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

ముఖ్యఅతిథిగా డాక్టర్ కృష్ణ ఎల్లా..

వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పర్యవేక్షణలో చాన్స్‌లర్ జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగే స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ కృష్ణా ఎల్లా ,హెచ్‌సీయూ చీఫ్ రెక్టార్ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ గెస్ట్ ఆఫ్ హానర్‌గా విచ్చేస్తారు. కాగా హెచ్‌సీయూ క్యాంపస్ నుంచి శాంతిసరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియం వరకు విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.

హెచ్‌సీయూకు 2025లో ప్రత్యేక గుర్తింపులు

- ప్రపంచవ్యాప్తంగా 34 మంది హెచ్‌సీయూ ఫ్యాకల్టీలకు 2 శాతం అత్యుత్తమ అధ్యాపకులుగా ఆగస్టు-2025లో స్టాన్‌ఫోర్డ్/ఎల్సేవియార్ సంస్థ గుర్తింపునివ్వడం విశేషం. హెచ్‌సీయూకు ప్రత్యేక స్థానం కల్పించినట్లయింది.
- నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్(ఎన్ఐఆర్ఎఫ్)-2025లో స్థానం లభించింది. ముఖ్యంగా ఎన్ఐఆర్ఎఫ్-2025 ర్యాంకింగ్స్‌ను అయిదు పారామితుల ఆధారంగా ర్యాంక్‌ను కేటాయించారు. ముఖ్యంగా బోధన, అభ్యాసం, వనరులు, పరిశోధన, వృత్తిపరమైన అభ్యాసం, గ్రాడ్యుయేషన్ ఫలితం, ఔట్రీచ్, ఇన్‌క్లూజివిటీ, పర్సెప్షన్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని ర్యాంకింగ్స్‌ను ఆయా ఉన్నత విద్యాసంస్థలకు కేటాయించారు.

ఎన్ఐఆర్ఎఫ్-2025 ర్యాంకింగ్స్ వివరాలు ఇవే..

- హెచ్‌సీయూ ఓవరాల్ కేటగిరిలో 26వ స్థానం
- విశ్వవిద్యాలయం కేటగిరిలో 18వస్థానం
- ఇంజనీరింగ్ విభాగంలో 74వ స్థానం
- పరిశోధనల సంస్థల కేటగిరిలో 32వ స్థానం.

పెయిన్ స్కేప్-2025 సదస్సు ప్రారంభం

నొప్పిని మరిపించే 'ఎక్స్ఆర్ టెక్నాలజీ'
- గచ్చిబౌలి కిమ్స్ ఆస్పత్రిలో తొలిసారి ఆవిష్కరణ
- కిమ్స్ ఆస్పత్రుల చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు వెల్లడి
- రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 160 మంది వైద్యుల హాజరు



కిమ్స్ ఆస్పత్రిలో 'ఎక్స్ఆర్ టెక్నాలజీ' పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎండీ డా.భాస్కర్‌రావు వైద్యులు

రాయదుర్గం: అన్ని రకాల నొప్పులను మర్చిపోయేలా 'ఎక్స్ఆర్' అనే సరికొత్త టెక్నాలజీని ఆవిష్కరించినట్లు కిమ్స్ ఆస్పత్రుల చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని కిమ్స్ ఆస్పత్రిలో 'పెయిన్ స్కేప్-2025' పేరిట నిర్వహించిన సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొన్ని శస్త్ర చికిత్సల వల్ల దీర్ఘకాలం పాటు నొప్పి ఉంటుందని, కొన్నిసార్లు కండరాల నొప్పి వస్తుందన్నారు. క్యాన్సర్ చికిత్స వల్ల నరాల్లోనూ, మెడ, తలనొప్పి లాంటివి వేధిస్తుంటాయన్నారు. గర్భిణుల ప్రసవ నొప్పులకు పరిష్కారంగా ఈ ఎక్స్ఆర్ టెక్నాలజీ ఉపయోగపడుతుందన్నారు. ఆస్పత్రి అసోసియేట్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అంకిత ఆర్ చావ్లా మాట్లాడుతూ రోగులకు ఎక్స్ఆర్ టెక్నాలజీ హెడ్ సెట్ తగిలిస్తే మరో లోకంలోకి వెళ్లినట్లే భావన కలుగుతుందన్నారు. పిల్లలకు ఇంజెక్షన్ చేసే ముందు లేదా కాన్యులా పెట్టే ముందు ఈ ఎక్స్ఆర్ (ఎక్స్‌టెండెడ్ రియాలిటీ) హెడ్‌సెట్ తగిలిస్తే ఎక్కడో మైదానంలో ఆడుకుంటున్నట్లు కనిపిస్తుందని సులభంగా ఇంజెక్షన్ చేయవచ్చని, కాన్యులా పెట్టవచ్చని వివరించారు. ఈ సదస్సులో కిమ్స్ ఆస్పత్రి మెడికల్ ఎడ్యుకేషన్, అకడమిక్స్ డైరెక్టర్ డాక్టర్ మణిమాలారావు, ఆస్పత్రి క్లస్టర్ హెడ్ కిషోర్‌రెడ్డి, నిమ్స్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, న్యూఢిల్లీ గంగారాం ఆస్పత్రి పెయిన్ రిలీఫ్ యూనిట్ డైరెక్టర్, పెయిన్ మెడిసిన్ అధ్యుడు డాక్టర్ ప్రదీప్‌జైన్, డాక్టర్ మురళీధర్ జోషి, నిమ్స్ నస్థీషియా విభాగం అదనపు డైరెక్టర్ డాక్టర ఆఖ్య కుమార్‌కర్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 160 మంది వైద్యులు పాల్గొన్నారు.



కనువిందుగా..



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలలో భాగంగా శనివారం బెంగుళూరికి చెందిన భరతనాట్య గురువు రాగిణి , రక్షిత రఘునాథన్ శిష్యబృందం మల్లారి, తోదయ మంగళం, పుష్పాంజలి, అలరిపు, నటేశకౌతం , రామ నవరస, సాధించని, అలరులు కురియగా, శ్రీ సరస్వతి, భో శంభో, దశావతారం, తిల్లాన తదితర అంశాలను అమ్రితా, అనన్య, వైష్ణవి, అనన్య అనూప్ శతాక్షి, అనివార్థి, నక్షత్రలు ప్రదర్శించి అలరించారు. మేళాలో పలు స్టాల్స్ అందుబాటులో ఉన్నాయి. ఈనెల 5వ తేదీ వరకు నిర్వహించనున్న దసరా ఉత్సవాలలో నగరవాసులు చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు.

శివోహం చిత్ర ప్రదర్శన



మాదాపూర్: కళాకారిణి శిల్పా కాసు వేసిన చిత్రాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో శనివారం ఏర్పాటు చేసిన శివోహం చిత్ర ప్రదర్శనను సీనియర్ కళాకారులు రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. మహాశివుని రూపాలను అద్భుతంగా వేశారని కొనియాడారు. ఈనెల 8వ తేదీ వరకు నిర్వహించనున్న చిత్రప్రదర్శనలో 76 చిత్రాలను అందుబాటులో ఉంచినట్టు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాకారులు, ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లీకేజీ.. మంచినీరు రోడ్డుపాలు





అల్విన్‌కాలనీ సాయినగర్ కమాన్ ఎదురు వీధిలో పగిలిన పైపులైన్, వృథాగా పోతున్న నీరు

అల్విన్‌కాలనీ: కలుషిత నీటితో రోగాలబారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. అధికారులు పైపులైన్ మరమ్మతులను మమ అనిపిస్తుండడంతో సమస్య పునరావృతమవుతోందని స్థానికులు మండిపడుతున్నారు. మరమ్మతులు చేసి ఒక్కరోజు కూడా గడవక ముందే మళ్లీ పైపులైన్ పగిలి నీరు రోడ్డు పాలవుతున్నాయి. కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్ కాలనీ పైపులైన్ రోడ్డులోని సాయినగర్ కమాన్ ఎదురుగా రోడ్డులో పైపులైన్ పగిలిపోయింది. ఈ రహదారిలో మంచినీటి పైపులైన్ నిర్మించి సుమారు 5 దశాబ్దాలు గడిచాయని, ఈ రహదారిలో నిత్యం వందలాది భారీ వాహనాలు ప్రయాణించటంతో పైపులైన్‌లు పగిలిపోతున్నాయని అంటున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వీడి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



సమస్య పునరావృతం



పదే పదే మంచినీటి పైపులైన్‌లు పగిలిపోతున్నాయి. కలుషిత నీరు సరఫరా అవుతోంది. మరమ్మతు పనుల్లో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కనపడుతోంది. ప్రజా సొమ్ము దుర్వినియోగం అవుతోంది. కలుషితనీటితో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలి.

-నరేందర్‌రెడ్డి, స్థానికుడు

రాంగ్‌రూట్ డ్రైవ్ చేస్తే కఠిన చర్యలు

- రాంగ్‌రూట్‌లో వచ్చే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు
- చలాన్లతో పాటు వాహనాల సీజ్
- ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే



వాహనదారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే

బంజారాహిల్స్: రాంగ్ రూట్ డ్రైవింగ్‌తో ప్రమాదాలు జరుగుతాయని, ఎట్టి పరిస్థితుల్లోనూ రాంగ్ రూట్లో డ్రైవింగ్ చేయవద్దని, అలాంటి వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని నగర ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే హెచ్చరించారు. నంబర్ ప్లేట్ సరిగ్గా లేని, హెల్మెట్లు ధరించని, రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌లపై వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పోలీసులు శనివారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-36లోని బరోడా బ్యాంక్ చౌరస్తాలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌ను వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్‌తో కలిసి ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ఏయే ప్రాంతాల్లో రాంగ్‌సైడ్ డ్రైవింగ్ చేస్తున్నారో.. సంబంధిత హాట్‌స్పాట్‌లను గుర్తించి అక్కడ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు తెలిపారు.

- ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు లేకున్నా రాంగ్‌సైడ్‌లో డ్రైవింగ్ చేస్తే సీసీ కెమెరాల్లో ఫుటేజీలు ఉంటాయని, వాటి ఆధారంగా వాహనదారులకు చలాన్లు పంపిస్తామన్నారు. ఇటీవల కాలంలో ద్విచక్ర వాహనాలే కాకుండా కొంత మంది కార్లు కూడా రాంగ్‌సైడ్‌లో డ్రైవ్ చేస్తున్నారన్నారు. నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనదారులపై కొరఢా ఝుళిపిస్తున్నట్లు చెప్పారు. వాహనాలు కొనుగోలు చేసిన తర్వాత కొంతమంది తమ పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకోవడం లేదని, ఇంకా కొందరు రిజిస్ట్రేషన్ నంబర్ వచ్చినా తాత్కాలిక నంబర్లతో తిరుగుతున్నారని, వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదన్నారు. అలాంటి వాహనాలను సీజ్ చేయడమే కాకుండా ఎఫ్ఐఆర్‌లు కూడా నమోదు చేయిస్తున్నామన్నారు.
- కొంతమంది నంబర్ ప్లేట్లు ఉన్నా ట్రాఫిక్ పోలీసులు, కెమెరాలకు చిక్కకూడదనే ఉద్దేశ్యంతో వాటిపై స్టిక్కర్లు అంటించడం, రంగులు పూయడం చేస్తున్నారని వెల్లడించారు. నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనాలు చోరీకి గురైనవో, చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్నవో కావొచ్చని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా తిరుగుతున్న వాహనదారులపై ప్రతిరోజూ ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వారిని పట్టుకుంటామన్నారు. చలాన్లతో పాటు అవసరమైతే వాహనాలు సీజ్ చేస్తామన్నారు.

నిమజ్జనోత్సవం

పటాన్‌చెరు టౌన్: దుర్గామాత నిమజ్జనోత్సవం శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలో కనులపండువగా సాగింది. డివిజన్ పరిధిలోని శ్రీ రామలింగేశ్వర దేవస్థానంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని, అదేవిధంగా జేపీ కాలనీలో, గోకుల్‌నగర్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాలను మేళతాళాల నడుమ నృత్యం చేస్తూ తరలించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



గోకుల్‌నగర్‌లో.. నిమజ్జన వేడుకల్లో యువత

ఐటీ.. అబ్బురపడేలా..

ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని హర్మ్యాలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. రాత్రిపూట లైట్ల వెలుగుల్లో జిగేల్‌మంటున్నాయి. గ్రీనరీకి ప్రాధాన్యత ఇవ్వడంతో పచ్చదనంతో ఆకర్షణీయంగా కనపడుతున్నాయి. -గచ్చిబౌలి/రాయదుర్గం



గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ప్రధాన భవనం



ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)




టీ వర్క్స్



ఐఎస్‌బీ భవనం



రాత్రి ఇలా..



రాత్రి ఇలా..



రాత్రి ఇలా..



రాత్రి ఇలా..